క్లుప్తంగా

కమ్యూనిటీ హాలుకు మేయర్ భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని 18వ డివిజన్ వెంగముక్కపాలెంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మేయర్ గంగాడ సుజాత శుక్రవారం భూమి పూజ చేశారు. దాదాపు రూ.33 లక్షల వ్యయ అంచనాలతో నిర్మించతలపెట్టిన కమ్యూనిటీ హాలు వెంగముక్కపాలెం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అంజిరెడ్డి, కురుగుంట్ల ఏడుకొండలు, తిరుమలరెడ్డి, డీఈ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు, నూలుపై జీఎస్టీ తగ్గించాలి



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న చేనేత సంఘ నాయకులు

చీమకుర్తి: చేనేత వస్త్రాలు, నూలుపై రాష్ట్ర పరిధిలోని జీఎస్టీ తగ్గించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని చీమకుర్తి చేనేత సొసైటీ నాయకులు శుక్రవారం జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సొసైటీ అధ్యక్షుడు అవ్వారు ఆదినారాయణ, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సోమా యానాది శెట్టి, చీమకుర్తి పట్టణ కౌన్సిలర్ సోమా శేషాద్రి ఆధ్వర్యంలో చేనేత సంఘ నాయకులు మంత్రి సురేష్‌తో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. జీఎస్టీ తగ్గించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే విధంగా తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సురేష్‌ను సన్మానించారు.

ఒంగోలు సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్టు

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకుండా ప్రజాసంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


857 పొగాకు బేళ్ల కొనుగోలు

ఒంగోలు రూరల్: ఒంగోలు పొగాకు వేలం కేంద్రం–2లో శుక్రవారం 924 బేళ్లను వేలానికి ఉంచగా 857 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 22 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కేజీ గరిష్ట ధర రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.233గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

రెయిన్‌బో వైద్యశాలకు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

ఒంగోలు అర్బన్: రెయిన్‌బో దంత వైద్యశాలకు ఎన్‌ఏబీహెచ్ సంస్థ గుర్తింపు లభించినట్లు వైద్యశాల ఎండీ డాక్టర్ భగవాన్ ముది ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు లభించిన మొట్టమొదటి దంత వైద్యశాల తమదని పేర్కొన్నారు. అందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా అమ్మవారి ప్రాకారోత్సవం



అమ్మవారి ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డి.రజనీకుమారి, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలో బ్రహ్మరథం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- రూ.2.45 కోట్లతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్, పీహెచ్‌సీ భవనాలు ప్రారంభం
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం సంతనూతలపాడు మండలం వేములపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.82 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.1.60 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. సంతనూతలపాడు మండలంలోని మారుమూల గ్రామమైన వేములపాడులో రూ.2.45 కోట్ల విలువ చేసే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మించి స్థానిక ప్రజలకు సేవలను అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణమని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గత పాలకులు చేయనిది జగనన్న చేశారన్నారు. చిన్న పల్లెటూరులో కల్పించిన సదుపాయాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా అందించిన యూనిఫాంను విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బుక్‌లెట్లు అందించారు. ఒక్కో కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంతెంత ఆర్థిక ప్రయోజనం కలిగిందో అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించలేదని, అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరి వలనే సాధమైందని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన సేవలన్నీ గ్రామంలోనే పారదర్శకంగా అందించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ అండగా నిలబడి ఆశీర్వదించాలన్నారు. తొలుత గడప గడపకు హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబుకు స్థానిక నాయకులు డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. సచివాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా వారిని శాలువాలతో పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఈర్ల విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ మండవ సులోచన, పార్టీ గ్రామ నాయకుడు మండవ వెంకటనారాయణ, దుంపా యలమందారెడ్డి, బొల్లినేని కృష్ణయ్య స్థానికులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- వైద్య విభాగం కాంట్రాక్టు ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

చీమకుర్తి: వైద్యరంగంలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు క్షీరాభిషేకం చేశారు. సంతనూతలపాడు మండలం వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన మాట ప్రకారం 2014 జూన్ 2వ తేదీకి ముందు 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వైద్యరంగంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని క్యాబినెట్ ఆమోదించి జీఓ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్ట్ వైద్యరంగంలోని ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య విభాగం కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రత్నాకర్‌బాబు, యుగంధర్, రమేష్, ఆదిలక్ష్మి, సుజాత వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ ఈర్ల విజయలక్ష్మి, మండవ సులోచన, మండవ వెంకటనారాయణ పాల్గొన్నారు.

నాణ్యంగా జగనన్న గోరుముద్ద



జగనన్న గోరుముద్ద ఆహారాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: జగనన్న గోరుముద్ద ఆహారాన్ని నాణ్యంగా తయారు చేస్తున్నారని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగర పరిధిలోని త్రోవగుంట ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్నం నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్లు, చిక్కీల నాణ్యతను పరీక్షించారు. స్వయంగా తిని రుచులు గమనించారు. రోజువారీగా అందిస్తున్న మెనూ గురించి చిన్నారులనడిగి వివరాలు తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా మెనూ పాటించాలని పాఠశాల హెచ్‌ఎం, నిర్వాహకులకు సూచించారు.

రైతులకు అసౌకర్యం కలిగించొద్దు

- ఎరువులు, పురుగుమందుల డీలర్లు పారదర్శకంగా వ్యవహరించాలి
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ భూమన భవానీ హర్ష
- జిల్లాలోని డీలర్లతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, పక్కన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ భూమన భవానీ హర్ష

ఒంగోలు సబర్బన్: ఎరువులు, పురుగు మందుల విషయంలో డీలర్లు రైతులకు అసౌకర్యం కలిగించొద్దని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ భూమన భవానీ హర్ష సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లు, వ్యవసాయ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ చట్టాలకు లోబడే ఎరువులు, పురుగు మందుల డీలర్లు పనిచేయాలన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టినా, వారిని మోసం చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ మందులు, ఎరువులు తీసుకొచ్చి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు గుర్తించిన కొన్ని లోపాల గురించి డీలర్లకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తన చట్టాల గురించి వివరించారు. నిబంధనలను విస్మరిస్తే తీసుకునే చర్యల గురించి కూడా వివరించారు. రైతులు అడిగిన ఉత్పత్తులు మాత్రమే ఇవ్వాలని, డీలర్ల ఇష్టానుసారం అంటగట్టకూడదని అన్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించరాదని పేర్కొన్నారు. వ్యాపారానికి సంబంధించిన నివేదికలను, పత్రాలను, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు సమావేశంలో మండల, డివిజన్ల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదు



ఒంగోలులో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ఒంగోలు టౌన్: సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయడం సరికాదని వామపక్ష నేతలు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, నగర కార్యదర్శి జి.రమేష్ ప్రసంగించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయని సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ధర్నాలో భాగంగా శుక్రవారం కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రికార్డు అసిస్టెంట్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి పురిణి గోపి, సీపీఐ (ఎంఎల్) మండల కార్యదర్శి వాటంబేటి శ్రీరాములరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం లా కమిషన్ వైఖరి సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డీఎఫ్ నాయకులు

ఒంగోలు టౌన్: ముస్లింల హక్కులను పరిరక్షించాల్సిన ముస్లిం లా కమిషన్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఎస్‌డీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ సత్తార్ విమర్శించారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక మక్కా మసీద్ వద్ద ప్రార్థన అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ ప్రసంగిస్తూ ముస్లింల సంస్కృతి సంప్రదాయాలు తెలిసిన ముస్లిం లా యూనిఫాం సివిల్ కోడ్ విషయలో వారి అభిప్రాయాలు కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లిం లా కమిషన్ బీజేపీకి అమ్ముడుపోయిందని మండిపడ్డారు. దేశంలో ముస్లిం లా కమిషన్‌ను ఎత్తివేసే కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. సివిల్ కోడ్ వల్ల కేవలం ముస్లింలకు మాత్రమే నష్టం జరుగుతోందన్నది అపోహ మాత్రమే అని, హిందూ సోదరులకు ఎక్కువ ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. దేశంలో ఎన్నో జాతులు, కులాలు, ఉప కులాలు, తెగలు ఉన్నాయని, ముక్కోటి దేవతలతో పాటుగా గ్రామ దేవతలు కూడా ఎందరో ఉన్న ఈ దేశంలో ఒకే దేశం, ఒకే చట్టం అనడం సరికాదని చెప్పారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ కేంద్ర కమిటీ నాయకులు ఎంఏ సాలార్, ఫొండ్రి రహంతుల్లా, మస్తాన్‌వలి, ఇమ్రాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష సర్వే



మదనూరులో సర్వే గురించి తెలుసుకుంటున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు



ఒంగోలులో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



ఒంగోలు మండలం కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో అజిత

- ప్రతిరోజూ 15 గృహాలను సందర్శించాలి
- తప్పనిసరిగా 11 రకాల సర్వీసులు అందేలా చూడాలి
- కొత్తపట్నం మండలంలో సర్వేను తనిఖీ చేసిన ఆర్డీవో విశ్వేశ్వరరావు

కొత్తపట్నం: జగనన్న సురక్ష సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఒంగోలు ఆర్డీవో, నియోజకవర్గ అభివృద్ధి పరిశీలన అధికారి విశ్వేశ్వరరావు వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కొత్తపట్నం మండలంలోని మదనూరు గ్రామంలో జగనన్న సురక్ష సర్వేని శుక్రవారం ఆకస్మికంగా ఆర్డీవో తనిఖీ చేశారు. గృహ యజమానులతో మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా, వలంటీర్లు ఇంటికొచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారా, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మీకున్న సమస్యలు ఏమిటని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావులేకుండా 11 సర్వీసులను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలు పనులకు వెళ్లే సమయంలో ఇళ్లకు వెళ్లకుండా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు సర్వే చేయాలని సూచించారు. వారి సమస్యను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు ముఖచిత్రాన్ని కూడా సెల్‌లో తీసుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు సర్వే చేసిన తర్వాత వారికి క్యాంప్ పెట్టి పత్రాలు అందజేయాలని చెప్పారు. 11 సేవలకు సంబంధించి తన సమస్య ఉందని ఏ ఒక్కరూ చెప్పకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, తహసీల్దార్ బీవీ రమణారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వాయల రోశయ్య, సచివాలయ సిబ్బంది, వలింటీర్లు పాల్గొన్నారు.

గుండమాలలో...

కొత్తపట్నం మండలంలోని గుండమాల గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆదిత్య పవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి బ్లాక్‌లో లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 7న జరిగే క్యాంప్‌నకు లబ్ధిదారులు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారాని జయరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, లావణ్య, సచివాలయ సిబ్బంది, వలింటీర్లు పాల్గొన్నారు.

ఒంగోలు నగరంలో...

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాజీవ్ గృహ కల్ప వార్డు సచివాయం పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగారు. జగనన్న సురక్ష విధివిధానాలను వివరించారు. సచివాలయాల సెక్రటరీలు అవలంబించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ పథకాన్ని జూలై ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు సచివాలయ స్థాయిలో క్యాంపులు నిర్వహించి అమలు చేసి పథకాలకు అర్హులైన వారిని ఆగస్టు 1న ప్రకటించడం జరుగుతుందన్నారు. సర్టిఫికెట్ జారీకి సంబంధించిన సమస్యలేమైనా ఉంటే అలాంటి వాటిని నమోదు చేసుకోవాలన్నారు. అలాంటి వారికి జూలై 7వ తేదీ సచివాలయం వద్ద నిర్వహించే క్యాంపులో పత్రాలు అందించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 9వ డివిజన్ నాయకుడు వెన్నపూస వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ మండలం జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల...

ఒంగోలు రూరల్: ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంపుల షెడ్యూల్‌ను ఒంగోలు ఎంపీడీవో పి.అజిత వెల్లడించారు. ఒంగోలు మండల తహసీల్దార్, ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ప్రతినిధి పి.ప్రవీణ్‌తో కూడిన టీం గ్రామాల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. జూలై 1న చింతాయగారిపాలెం, 3న కరవది–1, 5న కరవది–2, 7న దేవరంపాడు హరిజనవాడ, 10న చేజర్ల, 12న ఉలిచి, 14న గుండాయపాలెం, 17న సర్వేరెడ్డిపాలెం, 19న యరజర్ల, 21న దశరాజుపల్లె, 24న మండువవారిపాలెం, 26న వలేటివారిపాలెంలో క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నవరత్నాల్లో భాగంగా టెక్నికల్ కారణాలతో పథకాలు ఆగిపోయిన వారికి పథకాలు అందించడంతో పాటు కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు మ్యుటేషన్స్, మొబైల్ నంబర్ ఆధార్ లింకేజీతో పాటు పంట హక్కుదారుని పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

చీరాల రూరల్: న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూదరాజు శశికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఐఏఎల్ కార్యాలయంలో శశికిరణ్ అధ్యక్షతన న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశికిరణ్ మాట్లాడారు. ఎంతో కాలంగా పరిష్కారం కోసం జూలై 4న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల ముందు ఐఏఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు పి. బాబ్జి, ఉపాధ్యక్షుడు ఎంఎస్‌ఏ. ప్రసాద్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఈ-క్రాప్‌తో ప్రయోజనాలు

మేదరమెట్ల: కౌలు రైతులు కౌలు కార్డులను అందుకున్న వెంటనే ఈ ఏడాది సాగు చేస్తున్న పంట వివరాలను ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు అన్నారు. కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు గ్రామంలో సీసీఆర్‌సీపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి కౌలు రైతూ ప్రభుత్వం అందించే అన్ని పథకాలకు అర్హుడవుతాడన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రభుత్వం అందించే లబ్ధి కౌలు రైతుకు అందుతుందని, అందుకోసం కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులను పొందాలన్నారు.